
సాక్షి
నిజామాబాద్
సోమవారం। 9। సెప్టెంబర్। 2024



తీన్‌పత్తాలో ఆన్‌లైన్ పేమెంట్

పేకాడేవారు కొత్త మార్గాలను అన్వేషి స్తున్నారు. పోలీసులు దాడి చేసినా డబ్బు దొరకకుండా ఆన్‌లైన్ పేమెంట్ చేస్తున్నారు.

- 8లో ▸



ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద

ఎస్సారెస్పీలోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. అధికారులు 1.05 లక్షల క్యూసెక్కులను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /22.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాయుగుండం ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మహేశ్ కుమార్ గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన నేపథ్యంలో బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తన కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

15న పీసీసీ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన మహేశ్‌కుమార్ గౌడ్ ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కోరారు.

‘అధికారులు పట్టించుకుంటలేరు’



సిరికొండ: తమ పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని సిరికొండ మండలం పాకాల గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం క్రితం కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు వేశాయని రైతులు తెలిపారు. పంటలు దెబ్బతిన్న ఇంత వరకు వ్యవసాయ, రెవెన్యు అధికారులు పరిశీలించలేదని వారు వాపోయారు. పెద్దవా గు, బైలూరు వాగులు పొంగడంతో 60 మంది రైతులకు చెందిన 200 ఎకరాల్లో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరదలకు గ్రామానికి వచ్చే రోడ్లు కూడా కోతకు గురయ్యాయని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ బాదావత్ రాజు, వీడీసీ సభ్యులు దేవిదా స్, రవీందర్, బాలు, చీనాలు, గంగా ధర్, తిరుపతి, రవి తదితరులు దెబ్బతిన్న పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ప్రజావాణి వాయిదా

నిజామాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేశారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతీ మంగళవారం, శుక్రవారం రాష్ట్ర స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో సమావేశం ఉన్న నేపథ్యంలో మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణిని బుధవారానికి మార్చినట్టు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించాలని కలెక్టర్ కోరారు. కాగా జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు.

వరద బాధితులకు 30 టన్నుల బియ్యం విరాళం




సుభాష్‌నగర్: ఖమ్మం వరద బాధితులకు నిజామాబాద్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 టన్నుల బియ్యం విరాళంగా అందజేశారు. కలెక్టరేట్ నుంచి ఖమ్మం జిల్లాకు బియ్యం లోడ్‌లో వెళ్తున్న లారీకి ఆదివారం సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం వైపీ రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మో టూరి దయానంద్ గుప్తా, లాభిశెట్టి శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ఆదివారం ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 39 వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,404.62 అడుగుల (17.25 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కులం ఒకటి..
సర్టిఫికెట్ మరోటి!

- ఉద్యోగోన్నతుల్లో మాయాజాలం
- ఆర్టీసీ రీజియన్ పరిధిలో కొందరి వక్రమార్గం
- నష్టపోయిన అర్హులైన ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని కొన్ని డిపోల్లో కొందరు ఉద్యోగులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగోన్నతులు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అర్హులైన ఉద్యోగులు తమకు ప్రమోషన్లు రాకుండా పోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు బీసీ ఉద్యోగులు ఎస్సీ కుల సర్టిఫికెట్లు తెచ్చుకున్నారని, మరికొందరు క్రిస్టియన్లుగా ఉన్నప్పటికీ ఎస్సీ సర్టిఫికెట్లు తెచ్చుకుని మరీ ఉద్యోగోన్నతులు సంపాదించడం పట్ల అర్హత కలిగిన ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం క్రిస్టియన్లు ఎస్సీ కేటగిరీలోకి రారు. ఇలా క్రిస్టియన్ మతాన్ని అవలంబించే వారు బీసీ–సీ కేటగిరీలోకి రావాలి. అయితే నిజామాబాద్ రీజియన్‌లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. దీంతో జూనియర్ అసిస్టెంట్లుగా, మెకానిక్‌లుగా చేరిన పలువురు గత పదేళ్లలో తప్పుడు సర్టిఫికెట్లతో ప్రమోషన్లు పొందినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. పదేళ్లుగా ప్రమోషన్ల మీద ఉన్న ఉద్యోగులు మళ్లీ తాజాగా ప్రమోషన్లు పొందిన నేపథ్యంలో తమకు సర్వీసు మొత్తం అన్యాయం జరుగుతోందని అర్హులైన వాళ్లు వాపోతున్నారు. తప్పుడు ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లతో కండక్టర్లుగా పనిచేస్తున్న కొందరు తాజాగా ఏడీసీ (అసిస్టెంట్ డిపో క్లర్క్), బస్ స్టేషన్ కంట్రోలర్‌లుగా పదోన్నతులు పొందారు. నిజామాబాద్–1, నిజామాబాద్–2, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ డిపోల్లో ఇలా ఉద్యోగోన్నతులు పొందిన వారి కారణంగా తమకు ప్రమోషన్లు రాకుండా పోయినట్లు పలువురు ఉద్యోగులు తెలిపారు.

■ గతంలో ఒక బీసీ ఉద్యోగి ఎస్సీ సర్టిఫికెట్ తెచ్చిన విషయమై ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాయి. విచారణకు ఆదేశిస్తానని ఆర్‌ఎం చెప్పారు. గతంలో ఒక బీసీ వ్యక్తి ఎస్సీ సర్టిఫికెట్‌తో కండక్టర్ ఉద్యోగం పొంది అసిస్టెంట్ డిపో క్లర్క్ వరకు విధులు నిర్వహించాడు. ఈ విషయమై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణ నిర్వహించిన ఆర్టీసీ వాస్తవమని తేల్చింది. దీంతో 30 ఏళ్ల సర్వీసు చేసిన అతన్ని సస్పెండ్ చేసి రిటైర్ అయ్యాక బెనిఫిట్స్ సైతం నిలిపేశారు. అయితే క్రిస్టియన్‌గా కన్వర్ట్ అయి ఉద్యోగోన్నతులు పొందిన వారి విషయంలో మాత్రం ఏవిధమైన విచారణ చేయించకపోతుండడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రిస్టియానిటీని అవలంబిస్తూ ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన ఉద్యోగుల విషయమై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డిని వివరణ కోరగా ప్రమోషన్లు సాధారణ కోటాలోనే ఇచ్చామన్నారు. ఇదిలా ఉండగా సర్టిఫికెట్ల విషయమై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నిర్ధారణ కోసం కలెక్టర్‌కు లెటర్ రాశామన్నారు. సర్టిఫికెట్లు తప్పుడువని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

డిచ్‌పల్లి మండల కేంద్రంలో కొలువుదీరిన గణనాథుడు



కొలువుదీరిన గణపయ్య

జిల్లావ్యాప్తంగా శనివారం వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో వినాయకుని ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భారీ గణనాథుడి విగ్రహాలను శోభాయాత్రగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. విఘ్నేశుడికి తొలిపూజ చేసి, భక్తులకు ప్రసాదం అందజేశారు.



నగరంలోని పెద్దబజార్‌లో వినాయకుడి ప్రతిమను తీసుకెళ్తున్న చిన్నారులు

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు జారీ
- తప్పనున్న కరెంట్ బిల్లుల భారం

మోర్తాడ్: గృహజ్యోతి పథకం మాదిరిగానే అన్ని రకాల ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు నిధుల కొరత తీవ్రంగా ఉండటం, ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపులకే సరిపోవడంతో ఇన్నాళ్లు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రధానంగా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి నిధుల కొరత తీవ్రం కావడం, మెయింటెనెన్స్ గ్రాంట్ మొత్తం విద్యుత్ బిల్లులకే సరిపోయేది. ఈ నేపథ్యంలో సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వ విద్యా సంస్థలకు కేటగిరి 7 కింద కనెక్షన్‌లు ఇస్తున్నారు. ఈ కేటగిరిలో ఒక్కో యూనిట్‌కు రూ.8 చొప్పున బిల్లు చెల్లించాల్సి ఉంది. దీంతో ఇళ్లకు 200లోపు యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని అప్పట్లో ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. తాజాగా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడంతో కరెంట్ బిల్లుల భారం తప్పనుంది. కాగా బీసీ, ఎస్సీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తారా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది.



మోర్తాడ్‌లోని ప్రాథమిక పాఠశాల

జిల్లాలో ఉచిత విద్యుత్ పొందనున్న విద్యా సంస్థలు

ప్రాథమిక పాఠశాలలు	693
ప్రాథమికోన్నత పాఠశాలలు	116
ఉన్నత పాఠశాలలు	230
డీఈవో కంట్రోల్‌లో ఉన్న పాఠశాలలు	112
కేజీబీవీలు	25
డిగ్రీ కాలేజీలు	7
జూనియర్ కళాశాలలు	16

ఉత్తర్వులు జారీ అయ్యాయి

ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు కేటగిరి 7 కింద బిల్లులు జారీ చేశాం . ఇప్పుడు ఉచితంగానే విద్యుత్ సరఫరా చేయాల్సి ఉన్నందున జీరో బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది.

– వినోద్‌కుమార్, ఏడీఈ, మోర్తాడ్, భీమ్‌గల్

ఆక్రమణలు ఆగేనా?

- నిజాంసాగర్ కాలువను ఆక్రమిస్తున్న బడాబాబులు
- ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న మున్సిపల్ అధికారులు
- పట్టించుకోని ఇరిగేషన్ యంత్రాంగం

ఆర్మూర్: హైడ్రా తరహాలో జిల్లాల్లో సైతం ఏజెన్సీలను ఏర్పాటు చేసి చెరువులు, కాలువల ఆక్రమణలను తొలగించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జిల్లాలో ఆక్రమణలపై ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. ఆర్మూర్ పట్టణంలో కబ్జాలకు గురవుతున్న రూ.కోట్ల విలువైన నిజాంసాగర్ కాలువ స్థలం తెరపైకి వచ్చింది. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్–కొటార్మూర్ గ్రామాల చెరువులకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని అందించిన మైనర్ కాలువ ఆక్రమణలకు గురైంది. నీటిపారుదల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ భవనాలను నిర్మిస్తున్నారు. మున్సిపల్ అధికారులేమో ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. ప్రభుత్వ భూమిని బడాబాబులు ఆక్రమించుకుంటున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ న్యూడెమోక్రసీ నాయకులు నిరుపేదలతో కాలువపై గుడిసెలు వేయించారు. ఒకప్పటి కలెక్టర్ రామాంజనేయులు కాలువ స్థలంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు అనుమతినివ్వడంతో మున్సిపల్ అధికారులు సైతం ఆ ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించారు. మామిడిపల్లి శివారులోని కాలువ నుంచి 63వ నెంబర్ జాతీయ రహదారి వరకు ఈ ఆక్రమణలున్నాయి.



మామిడిపల్లి శివారులో నిజాంసాగర్ కాలువకు ఇరువైపులా నిర్మించిన భవనాలు



పెర్కిట్ శివారులో నిజాంసాగర్ కాలువను కబ్జా చేసి నిర్మించిన బార్ అండ్ రెస్టారెంట్

కొనసాగుతున్న ఆక్రమణలు..

ఇటీవల పెర్కిట్‌లోని కుక్కల గుట్ట సమీపంలో, బైపాస్ రోడ్డు సమీపంలో కాలువ ఆక్రమించుకొని కమర్షియల్ బిల్డింగులు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. మరోవైపు విశాఖ హైస్కూల్ వెనక భాగంలో ఇదే కాలువ స్థలంలో ప్రభుత్వం ఐసీడీఎస్ కార్యాలయ భవనాన్ని నిర్మించింది. ఇది కాలువ ఆక్రమణదారులను మరింత ప్రోత్సహించినట్లయింది. ఈ ఆక్రమణల విషయమై సంబంధిత అధికారిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నిజాంసాగర్ కాలువ వివరాలు..

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఆర్మూర్ ప్రాంతానికి అందించే 82/2 సబ్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ఆర్మూర్ పట్టణ శివారు నుంచి లక్కోర మీదుగా గోవింద్‌పేట్ వైపునకు వెళ్తుంది. ఈ కెనాల్ నుంచి పట్టణ శివారులోని రాజారాంనగర్ కాలనీ సమీపంలో 82/2/1 మైనర్ కెనాల్ బయలుదేరి 63వ నెంబర్ జాతీయ రహదారిని క్రాస్ చేస్తూ పెర్కిట్ వరకు ఉంది. ఈ కాలువ నుంచి ఉన్న మరో పిల్ల కాలువ ద్వారా వచ్చిన సాగునీరు పెర్కిట్‌లోని ఊర చెరువు, కొటార్మూర్‌లోని పెద్ద చెరువు, కుంటలను నింపేది. ఈ మైనర్ కాలువ డిస్ట్రిబ్యూటరీ నుంచి 70 ఫీట్ల వెడల్పుతో 3.9 కిలోమీటర్ల పొడవు ఉండేది. కాలక్రమంలో నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆర్మూర్‌కు సాగునీటి సరఫరా నిలిపివేశారు. పెర్కిట్‌లోని ఊరచెరువుకు నీరందించడానికి ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీ సమీపంలో 82/2 సబ్ డిస్ట్రిబూటరీ పైన తూము నిర్మించి పిల్లకాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువ హౌజింగ్‌బోర్డు కాలనీ మీదుగా వెళ్లి పెర్కిట్ చెరువులో కలుస్తుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి అడపాదడపా వచ్చిన నీటిని ఈ పిల్ల కాలువ ద్వారా పెర్కిట్ చెరువుకు అందించడంతో మైనర్ కాలువ వృథాగా మారింది. దీంతో రాజా రాంనగర్ కాలనీ నుంచి పెర్కిట్ వరకు గల కాలువ పక్కనే ఉన్నవారు కాలువను మూసివేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

నిబంధనలు బేఖాతర్!

- కనీస సౌకర్యాలు లేకున్నా కళాశాలలకు అనుమతులు
- కొన్ని చోట్ల చెరువుల్లో నిర్మించిన భవనాల్లో కొనసాగుతున్న కాలేజీలు
- తూతూమంత్రంగా తనిఖీలు చేసి రెన్యువల్ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: భవిష్యత్ టీచర్లను తయారు చేయాల్సిన బోధన కళాశాలలు గతితప్పి వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. 10 కళాశాలలకు 100 సీట్ల వరకు ప్రవేశాలు ఉండగా.. 3 కళాశాలల్లో 50 సీట్ల వరకే ప్రవేశాలకు అనుమతి ఉంది. ప్రతి ఏటా కళాశాలల యాజమాన్యాలు అధికారులను తప్పుదోవ పట్టిస్తూ అనుమతులు పొందుతున్నాయి. జిల్లాలో బీఎడ్ కళాశాలలు ఎన్‌సీఈఆర్‌టీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌అండ్ ట్రెనింగ్) నిబంధనలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. యూనివర్సిటీ అధికారులు తూతూ మంత్రంగానే తనిఖీలు చేసి అఫిలియేషన్‌లు రెన్యువల్ చేస్తున్నారు. బీఎడ్ కళాశాలలో నిబంధనల ప్రకారం 16 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉండాల్సి ఉండగా నలుగురైదుగురితో కొనసాగిస్తున్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లను రూ.లక్షలకు అమ్ముకుంటున్నారు. అటెండెన్స్ తగ్గిందని, ల్యాబ్‌కు, ప్రాక్టికల్స్‌కు ఒక్కొక్క దానికి ఒక్కొక్క రేటుతో డబ్బులు వసూలు చేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తుంది ఆర్మూర్‌లోని ఓ బీఈడీ కళాశాల. చెరువులో నిర్మించిన భవనంలో కళాశాల కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. కానీ ఈ ఏడాది అఫిలియేషన్(అడ్మిషన్లకు అనుమతి)కు మాత్రం అర్హత పొందింది.

కొన్ని కళాశాలలకే సొంత భవనాలు..

సొంత భవనాలు కొన్ని కళాశాలలకు మాత్రమే ఉన్నాయి. సొంత భవనాలు ఉన్నా ల్యాబ్‌లు, సెమినార్ హాల్స్ లేవు. డెవలప్‌మెంట్ ఫీజు పేరిట కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. బోధన్‌లో ఓ కళాశాలలో సరైన తరగతుల గదులు అందుబాటులో లేవు. ప్రతి రోజు విద్యార్థులు తరగతులకు రాకున్నా వచ్చినట్లు అధికారులకు కట్టుకథలు చెబుతున్నారు. ఫ్యాకల్టీ కూడా అందుబాటులో లేరు. ఆర్మూర్‌లో ఓ కళాశాల భవనం లాడ్జ్‌ను తలపిస్తోంది. ఇదే ప్రాంతంలో మరో కళాశాల చెరువులో నిర్మించిన భవనంలో ఏర్పాటు చేశారు. వాస్తవానికి సొంత భవనం ఉన్న వాటికే అఫిలియేషన్ ఇవ్వాలి. కానీ జిల్లాలో 8 కళాశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో షిఫ్టింగ్ అనుమతి లేకుండా ఓ కళాశాల కొనేళ్లుగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నగర శివారు వర్ని రోడ్డులో ఓ కాలేజీ ఉత్సవ విగ్రహం మాదిరిగానే ఉంది. సుభాష్‌నగర్‌లో ఓ కళాశాల పాఠశాల భవనంలో కొనసాగుతోంది.

కోర్టు అనుమతులతో అడ్మిషన్లు

జిల్లాలో కొన్ని కళాశాలలు పదేళ్లుగా కోర్టు అనుమతితో అడ్మిషన్లు పొందుతున్నాయి. అడ్మిషన్ల సమయంలో ఈ సారి అనుమతి ఇవ్వండి సౌకర్యాలు వెంటనే కల్పిస్తాం అంటూ చెబుతున్నాయి. చాలా వరకు అధికారులను మచ్చిక చేసుకొని ప్రతి ఏటా అక్రమ మార్గంలో అనుమతులు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బీఎడ్ కళాశాలలపై యూనివర్సిటీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రతి విద్యా సంవత్సరం తనిఖీలు చేస్తున్నారు గాని ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. బీఎడ్ విద్యపై లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోంది. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులపైన ఉంది.

– రఘురాం, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గుర్తింపు రద్దు చేయాలి



నిబంధనలు పాటించని బీఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి. గుర్తింపు రద్దు చెయ్యాలి. కొనేళ్లుగా కళాశాలలు నామమాత్రంగానే కొనసాగుతూ విద్యార్థుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. అధికారులు కూడా చర్యలు తీసుకోకుండా ఉండడం వల్ల కళాశాలలు పూర్తిగా దారి తప్పి వ్యవహరిస్తున్నాయి.

– జైత్రమ్ రాథోడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

అ'పూర్వ' సమ్మేళనం



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత ఒకేచోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

సైబర్ నేరగాళ్ల నయా మోసం

మోర్తాడ్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. జనాలను మోసం చేసేందుకు కొత్త పంథాను ఎంచుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారని, మోసం చేసేందుకు కొత్త విధానాలను అనుసరిస్తున్నారు. కొందరి నంబర్లను హ్యాక్ చేసి వారి బంధువుల నంబర్లకు లింక్‌ల ద్వారా వాటిని ఓపెన్ చేయలాంటు మెసేజ్ పంపుతూ నగదును అపహరిస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన మైలారం ప్రవీణ్ అతడి సోదరుడు మోహన్ నంబర్ ద్వారా వాట్సాప్ బ్లాక్ అయిందని ఆ లింక్ ఓపెన్ చేయాలంటు సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపించారు. తన సోదరుడి నంబర్ నుంచే కదా మెసేజ్ వచ్చిందని లింక్ ఓపెన్ చేయగా అతని ఖాతాలో ఉన్న రూ.94,160 నగదు మాయమైంది. విషయం గుర్తించిన ప్రవీణ్ వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించాడు. జార్ఖండ్ రాష్ట్రం నుంచి సైబర్ నేరగాళ్లు నంబర్‌ను హ్యాక్ చేసినట్లు గుర్తించారు. ఈ విషయమై ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా సైబర్ నేరాలు చేసే వారు ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండిన వారు 8, 10 తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈనెల 11 నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కళాశాలల్లో సంప్రదించాలన్నారు. అభ్యర్థి తాను కోరుకున్న ఐటీఐ కళాశాలలో సీటు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకొని సీటు పొందవచ్చని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద



గోదావరిలోకి వదులుతున్న నీరు

- వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల
- లక్షా 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి శనివారం ఉదయం నుంచి వరద మళ్లీ పోటెత్తింది. దీంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి ఆదివారం ఉదయం నుంచి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు చేపట్టారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 76 టీఎంసీలు ఉండగా ప్రాజెక్ట్‌లోకి వరద 30 వేల క్యూసెక్కులకు పడిపోయింది. శనివారం ఉదయం క్రమంగా పెరుగుతూ ఆదివారం మధ్యాహ్నానికి లక్షా 5వేల క్యూసెక్కులు పెరిగింది. ప్రాజెక్ట్ నిండుకుండలా మారినా ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండటంతో అధికారులు ముందుగా 9 గేట్లను ఎత్తి 25 వేల క్యూసెక్కులు గోదావరిలోకి వదిలారు. తర్వాత 16 గేట్లను ఎత్తి 50 వేల క్యూసెక్కులు వదిలారు. మధ్యాహ్నానికి మరింత వరద పెరగడంతో 24 గేట్లను ఎత్తి లక్ష క్యూసెక్కులు గోదావరిలోకి వదిలారు. నిలకడగా వరద వచ్చి చేరుతుండటంతో అంతేస్థాయిలో లక్ష క్యూసెక్కుల నీటిని గోదావరి లోకి నిలకడగా వదులుతున్నారు.

వరద కాలువ ద్వారా..

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండటంతో వరద కాలువ ద్వారా ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను పెంచారు. మొదట 2వేల నుంచి పెంచి చివరకు 18 వేల క్యూసెక్కుల నీటి విడుదల పెంచి వదిలారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, ఆవిరి రూపంలో 666, మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1090.9(80.05 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు.

పెరిగిన విద్యుదుత్పత్తి..

ప్రాజెక్ట్ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్ల ద్వారా 36.10 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8.32 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు.

పర్యాటకుల సందడి



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి గోదావరిలోకి వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రాజెక్ట్ వద్ద సండే సందడి కనిపించింది. ప్రాజెక్ట్‌పై అనుమతులు లేకపోయినా పర్యాటకులు దిగువన గోదావరి అంచున సందడి చేస్తున్నారు.

తీన్‌పత్తాలో ఆన్‌లైన్ పేమెంట్

- పోలీసుల దాడుల్లో దొరకని నగదు
- బ్యాంకు ఖాతాలో నగదు చూపిన తరువాతే ఆటలోకి ఎంట్రీ
- రౌండ్ రౌండ్‌కు నగదు బదిలీ చేసుకుంటున్న పేకాటరాయుళ్లు



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం సుంకెట్ శివారులోని ఓ ఫామ్ హౌజ్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులకు పట్టుబడిన నగదు మాత్రం కేవలం రూ.12,170 మాత్రమే. ఈ కేసులో పోలీసులు విలువైన సెల్‌ఫోన్‌లతోపాటు కారు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పదిహేను రోజుల క్రితం కమ్మర్‌పల్లిలోని ఓ ఫంక్షన్‌హాలులో పేకాట ఆడుతున్న 35 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడ రూ.2.38లక్షల నగదు మాత్రమే పట్టుబడింది. మన జిల్లాతో పాటు, జగిత్యాల్, మంచిర్యాల్ జిల్లాలకు చెందిన 35 మంది వేర్వేరు గ్రూపులుగా పేకాట ఆడుతున్నారు. ఈ పేకాట స్థావరాన్ని క్లబ్ తరహాలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా కార్లు, బైక్‌లు, విలువైన సెల్‌ఫోన్‌లు పోలీసులకు లభించాయి. పేకాట ఆడుతున్న వారి సంఖ్య భారీగానే ఉన్నా పట్టుబడిన నగదు మాత్రం తక్కువే ఉంది.పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులకు పట్టుబడుతున్న పేకాటరాయుళ్ల సంఖ్యకు అక్కడ సీజ్ చేస్తున నగదుకు పొంతలేకపోవడానికి కారణం ఆన్‌లైన్ పేమెంట్ విధానమే కారణమని తెలుస్తోంది. తీన్‌పత్తా(మూడు ముక్కలాట)లో పేకాటరాయుళ్లు నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేసుకుంటున్నట్లు సమాచారం. పేకాట ఆడేందుకు కూర్చునే ముందే తమ బ్యాంక్ అకౌంట్లలో నగదును చూపి ఆడుతున్నారు. రౌండ్ రౌండ్‌కు లెక్కలు చూసుకుని ఆన్‌లైన్‌లో నగదు లావాదేవీలు జరుపుతున్నారు. ఫామ్‌హౌజ్‌లు, ఫంక్షన్ హాళ్లు, స్టార్ హోటళ్లలో పేకాట ఆడేవారిలో అనేక మంది ఆర్థికంగా స్థితిమంతులే. గతంలో నగదు చూపిన తరువాతే పేకాట ఆడటం కారణంగా పోలీసులు దాడులు చేసిన సమయంలో పెద్ద మొత్తం డబ్బు పట్టుబడేది. ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో పట్టుబడుతున్న నగదు తక్కువ మొత్తంలో ఉంటోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి జిల్లాలో ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి వంద వరకు కేసులు నమోదు చేయగా, రూ.30లక్షల వరకు నగదును సీజ్ చేశారు. పేకాట ఆడుతున్న సమయంలో పట్టుబడిన వారి ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలిస్తే అసలు విషయం బయటకు వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

క్షుణ్ణంగా పరిశీలిస్తాం..

పేకాట స్థావరాలపై దాడుల చేసిన సమయంలో మొబైల్ ఫోన్‌లు తనిఖీ చేస్తున్నాం. ఆన్‌లైన్ పేమెంట్‌లు ఏమైనా జరిగాయా లేదా అని పరిశీలిస్తున్నాం. నగదు ఎక్కువ లభ్యం కాకపోవడంపై మాకు కూడా సందేహాలు ఉన్నాయి. పేకాట ఆడేవారు నగదు లావాదేవీల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముందు ముందు జరిపే దాడుల్లో క్షుణ్ణంగా పరిశీలన చేస్తాం.

– విష్ణుమూర్తి, ఏసీపీ, టాస్క్‌ఫోర్స్

తెలంగాణ వైతాళికుడు కాళోజీ

- నేడు తెలంగాణ భాషా దినోత్సవంగా కాళోజీ జయంతి
- అధికారికంగా నిర్వహించనున్న ప్రభుత్వం



మోర్తాడ్: తెలుగు భాష అస్తిత్వం కోసం తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణ రావు తన రచనల ద్వారా ఎంతో శ్రమించారు. కాళోజీ కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు. అయినా తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించి ఈ భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ప్రతి ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సెప్టెంబర్ 9న కాళోజీ నారాయణ రావు జయంతికి గుర్తింపునిస్తూ తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తెలుగు భాషాభివృద్ధికి దోహదపడినవారిలో గిడుగు రామ్మూర్తి కంటే కాళోజీ నారాయణ రావు ముందటివారు. కానీ తెలుగు భాషాభివృద్ధికి కాళోజీ చేసిన సేవలు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాతే వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ యాస అంటే తెలుగు భాష అని గట్టిగా వాదిస్తూ తెలుగు భాషా వ్యాప్తికి తన రచనలతో విమర్శకులను మెప్పించిన కవి, రచయిత కాళోజీ. తెలంగాణ యాసలో తెలుగు భాషలో 30 నుంచి 40 రచనలను చేశారు కాళోజీ. ఆయన రచించిన గ్రంథాల్లో ప్రసిద్ధ రచన 'నా గొడవ' అనే పుస్తకానికి ప్రసిద్ధ జ్ఞానపీఠ అవార్డు దక్కాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల దక్కలేదు.

తెలుగు నుంచే తెలంగాణ పదం

తెలుగు పదం నుంచే తెలంగాణ పదం జీవం పోసుకుందని చెప్పడానికి ఎన్నో చారిత్రక ఆధారాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన శైవాలయాల్లో కాళేశ్వరం, ముక్తేశ్వరం, వేములవాడలు ప్రధానం. ఈ మూడు చోట్ల లింగేశ్వరుడు వివిధ రూపాలలో కొలువై ఉండటంతో త్రిలింగం అనే పేరు వచ్చింది. తెలుగు పదం ఉద్భవించిన తర్వాత మన ప్రాంతంలో మాట్లాడే భాషను తెలుగు భాషగా గుర్తించారు. తెలుగు భాష మాట్లాడే ప్రాంతాన్ని తెలంగాణ అని వాడుకలోకి తీసుకవచ్చినట్లు చరిత్రకారులు స్పష్టం చేశారు.

యాస, భాషపై మక్కువ



తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఎనలేని మక్కువ. తెలంగాణ భాషను యాసను వెక్కిరించేవారికి తనదైన శైలిలో కాళోజీ చురకలు అంటించేవారు. ఆయన కవిత్వం పూర్తిగా తెలంగాణ మాండలికంలోను సాగింది. తెలంగాణ వైతాళికునిగా కీర్తిని సంపాదించుకున్న కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఎంతో సంతోషం.

– ప్రవీణ్ శర్మ, తెలుగు పండిట్, ఏర్గట్ల

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ





మహేశ్‌గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న శేఖర్‌గౌడ్, ఖైసర్, నరేందర్‌సింగ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను నిజామాబాద్ జిల్లా నేతలు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మహేశ్‌గౌడ్‌ను కలిసినవారిలో పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు కాలూరి భోజన్న, సయ్యద్ ఖైసర్, నరేందర్‌సింగ్, రాజేంద్రప్రసాద్, అంతిరెడ్డి రాజిరెడ్డి, ఆకుల శ్రీశైలం, దయాకర్ గౌడ్, అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, యాదగిరి తదితరులు ఉన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లాకు చెందిన నాయకులు పొద్దుటూరి వినయ్‌రెడ్డి, సాయి మెస్ మీసాల శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.



సీఎం, పీసీసీ అధ్యక్షుడితో వినయ్‌రెడ్డి, శ్రీనివాస్

యువతిపై లైంగిక దాడి

ఖలీల్‌వాడి: జిల్లాకు చెందిన ఓ యువతిపై ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యువతిని సదరు యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి హైదరాబాద్ రప్పించాడు. నారాయణగూడలోని ఓ లాడ్జిలో 20 రోజులుగా ఉంచి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు.

14 నుంచి సైక్లింగ్ పోటీలు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు

నిజామాబాద్ నాగారం: జిల్లాలో మొదటిసారిగా ఖేలో ఇండియా ఉమెన్స్‌లీగ్, రోడ్డు సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ సైక్లింగ్ ఇండియా ప్రతినిధి ఎంకె పాషా, జిల్లా కార్య దర్శి విజయ్‌కాంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ నెల 14,15వ తేదీల్లో ఖేలో ఇండియా ఉమెన్స్‌లీగ్, రోడ్డు సైక్లింగ్ పోటీలను కంఠేశ్వర్‌లోని బైపాస్ రోడ్డులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు జూనియర్ విభాగంలో 2006–07, సబ్ జూనియర్ విభాగంలో 2008–11 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గల బాలికలు, మహిళలు ఖేలో ఇండియా వెబ్‌సైట్‌లోని ఎన్‌ఆర్‌ఎస్‌ఆర్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ రూ.6వేలు, తృతీయ రూ.4 వేల నగదు ప్రోత్సాహం అందించన్నునట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. మరిన్ని వివరాలకు 9912883331 నంబర్‌న సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



గాంధారి: వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి శనివారం మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ(40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ చేపలవేట కోసం గ్రామ సమీపంలోని వాగుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాక పోవడంతో కుటుంబీకులు వాగు వద్దకు వెళ్లి వెతకగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య రిహానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెక్ డ్యాంలో పడి యువకుడు..



ఇందల్‌వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుర్రాల ప్రశాంత్(30) ప్రమాదవశాత్తు చెక్ డ్యాంలో పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చాడు. ఆదివారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లిన అతను పొలం పక్కనే ఉన్న చెక్ డ్యాంను చూద్దామని వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాలువలో పడి మరొకరు..



నిజామాబాద్ రూరల్: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన సంత్‌పాలే జ్యోతిరాం(54) ఒకటో డివిజన్ ఖానాపూర్ శివారులో ఉన్న కాలువలో పడి మృతిచెందాడని రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు జ్యోతిరాం ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవల తాగుడు బానిసయ్యాడు. ఖానాపూర్ నుంచి నాందేవ్‌వాడకు నడుచుకుంటూ వెళ్తుండగా ఖానాపూర్ ప్రాంతంలోని కాలువలో శనివారం పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని కాలువ నుంచి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

సంతోష్‌నగర్ తండాలో మహిళ..



బాన్సువాడ రూరల్: రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న ఓ మహిళ కాలువలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తబాది గ్రామం సంతోష్‌నగర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లింగంపేట్ మండలం భవానిపేట్ గ్రామానికి చెందిన బుజ్జిగారి రాజమణి(41) ఆరోగ్య పరీక్షల నిమిత్తం బాన్సువాడలోని ఆస్పత్రికి వచ్చింది. సాయంత్రం సంతోష్‌నగర్ తండాలో ఉన్న తెలిసిన వారి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిమృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కాలువ నుంచి తీయించారు. అనంతరం బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మటన్ ముక్కల కోసం ఘర్షణ

- బారసాల ఫంక్షన్‌లో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు

లింగంపేట: ఆనందోత్సాహాల మధ్య సాగుతున్న ఫంక్షన్‌లో మటన్ ముక్క చిచ్చురేపింది. ఇరు వర్గాలుగా విడిపోయిన బంధువులు పరస్పరం దాడులు చేసుకుని, పోలీసు స్టేషన్ మెట్లెక్కారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలో ఆదివారం బారసాల(నామకరణం) ఫంక్షన్ జరిగింది. నామకరణం అనంతరం బంధుమిత్రులు భోజనాలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో మటన్ ముక్కలు తక్కువ వడ్డించారని ఆరోపిస్తూ నామకరణానికి వచ్చిన బంధువులు భోజనం వడ్డించేవారిపై దాడి చేశారు. దీంతో ఇరు వర్గాల వారు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం ఇరువర్గాలవారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకున్నాయని ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

కొడిచర్లలో అగ్ని ప్రమాదం



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్లలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి మారతిగొండకు చెందిన నివాసపు గృహం దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెంట్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇంట్లో వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారమందించారు. అప్పటికే ఇంట్లోని నగదు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. ప్రమాదంలో రూ. లక్షా 50వేలు నగదు, రెండు తులాల బంగారం, పదితులాల వెండి, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయని, సుమారు రూ. 4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. బాధిత కుటుంబానికి రెవెన్యూ అధికారులు తక్షణ సహాయాన్ని అందించారు. రూ. 25 కిలోల బియ్యం, రూ. ఐదు వేల నగదు అందజేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన పారిపల్లి బిసీల్ అనే యువకుడు, అతడి కుటుంబ సభ్యులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ ఆదివారం తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన సంపత్, చిన్నారెడ్డి, హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన నవదీప్ మద్యం మత్తులో పాతకక్షల నేపథ్యంలో శనివారం బిసీల్ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారని ఎస్సై తెలిపారు. అడ్డు వచ్చిన కుటుంబీకులపై దాడి చేశారన్నారు.

విషయం తెలిసిన పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారన్నారు. వారికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నిజాంసాగర్: మండల కేంద్రంలోని బంజపల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 37,200 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దత్తాపూర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం

- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

డొంకేశ్వర్: మండలంలోని దత్తాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పలువురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. కిరాణషాపులో కూర్చున్న సుధారాణి వద్దకు వచ్చి విచక్షణ రహితంగా దాడి చేసింది. అలాగే రోడ్డుపై వెళ్తున్న హీరాబాయిని కరిచింది. స్థానికులు కుక్కను తరిమికొట్టి గాయాలైన మహిళలను చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క చిన్నపిల్లలపై దాడి చేస్తే పరిస్థితి వేరేలా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీర్కూర్‌లో బాలుడికి..



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మహిళ

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం వీధి కుక్కల దాడిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలో ఓ పన్నెండేళ్ల బాలుడు రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను తరిమివేశారు. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి బాగానే ఉంది. గతంలో కూడా వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలైన ఘటనలు ఉన్నాయని, అధికారులు తక్షణమే స్పందించి కుక్కల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ వద్ద భద్రత కరువు



ఫిరోజ్‌ను కాపాడేందుకు గోదావరిలో ఈదుతున్న రోహిత్

బాల్కొండ: ఎస్సారెస్పీ వద్ద భద్రత కరువవుతోంది. వారం రోజుల నుంచి అధికారులు గోదావరి లోకి నీటి విడుదల చేపడుతుండడంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కానీ పర్యాటకులు ప్రాజెక్ట్‌పైకి వెళ్లేందుకు పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అంతేకాకుండా ఆనకట్ట పొడవున, ఆనకట్ట కింద గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్ట్ దిగువన ఎస్కేప్ గేట్ల సమీపం నుంచి పుష్కర ఘాట్ వరకు ఎలాంటి భద్రత, బందోబస్తు లేదు. గతంలో అనేక ఘటనలు జరిగినా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎస్సారెస్పీ దిగువన ఉన్న గోదావరిలో ముంబైకి చెందిన ఫిరోజ్ ఆదివారం గల్లంతయ్యాడు. అతని ఆచూకీ లభించలేదు. అతని వెంట వచ్చిన మిత్రుడు రోహిత్ ఫిరోజ్ కోసం గోదావరిలో దూకి గాలించినా దొరకలేదు. ఉన్నతాధికారులు ఇకనైనా ఇలాంటి ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లచ్చాపేటలో చోరీ

మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేటలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన జనగామ దేవలక్ష్మి భువనగిరిలోని బంగారు లింగం దర్శనం కోసం ఈనెల 5న కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన కుటుంబీకులు ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, ఇరవై తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

తిర్మలాపూర్‌లో బైక్..

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజు బైక్ ఆదివారం చోరీకి గురైంది. రాజు తన బైక్‌ను శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం చూసే సరికి బైక్ కనిపించ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని హస్గుల్ గ్రామానికి చెందిన కొందరు రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఆదివారం దాడి చేసినట్లు పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.